

# ఎప్పుడో కలుసుకున్నాము

చందు సోంబాబు

ఆ రోజు కాలేజీలో అడుగు పెడుతూనే రాజారావు నోటమాట లేకుండా నిశ్చేష్టుడయ్యాడు.

కాలేజీ గోడల నిండా తన పేరు, సుమిత్ర పేరూ రాసేశారు. పెద్ద పెద్ద అక్షరాలతో బొగ్గుతో నల్లగా రాశారు. రాజారావుకి తల తిరిగినట్టయింది. కాలేజీలో తననందరూ వింతగా చూస్తున్నట్టనిపించింది.

అతనికేం చెయ్యాలో తోచలేదు. సరాసరి బయటకొచ్చి సత్యం గదికి చేరాడు. అతనక్కడికి చేరేసరికి సత్యం హాస్టల్ గది తాళం వేసివుంది.

తన దగ్గరున్న డూప్లికేట్ తాళం చెవితో గది తలుపు తెరచుకొని రాజారావు లోపల కెళ్ళి మంచంపైన వాలిపోయాడు. సత్యం రాజారావుకి ఆప్తమిత్రుడు. సొంత ఇల్లు వున్నా తరచుగా అతని గదిలోనే వుంటూ వుంటాడు రాజారావు.

సిగరెట్టు వెలిగించి వెర్రిగా ఆలోచిస్తున్నాడు. అది ఎవరు చేశారో,

ఎందుకు చేశారో రాజారావుకి తెలీక పోలేదు.

తను కాలేజీ ఎలక్షన్లో నించుని పెద్ద మెజారిటీతో గెలిచాడు. సుమిత్ర తనని సపోర్టు చెయ్యడవేఁ కాకుండా ప్రతి విద్యార్థీ విద్యార్థినీ ఇంటికి వెళ్ళి మరీ తనకి ఓటు చెయ్యమని రిక్వెస్టు చేసి చెప్పింది.

తనపైన సుబ్బారావు పోటీచేసి చిత్తుగా ఓడిపోయాడు. కక్షతో వాడే ఇలా చేసివుంటాడు. దెబ్బకు దెబ్బ తియ్యాలి. లేకపోతే తన పరువేంగానూ? తిరిగి సుమిత్ర మొహం ఎలా చూసేది?

పాపం! సుమిత్ర కాలేజీలో ఎలా తిరగ్గలదు? ఆ రాతలన్నీ చూసి తన పైన ఏవగింపుని పెంచుకొంటుందేమో సుమిత్ర అనుకొన్నాడు.

లేదు. సుమిత్ర అలాంటిది కాదు. తనకోసం ప్రాణమైనా ఇస్తుంది. సుమిత్ర తత్వం తనకి తెలీకపోతేగదా! అనుకొన్నాడు.

మరో సిగరెట్టు వెలిగించాడు.

సుబ్బారావుని అతని ముఠాసీ తిరిగి నోరెత్తకుండా పాతిపెట్టాలి. వాడి ఆగడాలకి హద్దు లేకుండా పోతోంది. అదే కాకుండా ఆడపిల్లల్ని కాలుకదిపి తిరగ నివ్వడంలేదు. రెండ్నెల్ల క్రితం కాబోలు. బస్సులో సరస్వతి అనేపిల్ల జాకెట్టు వెనక గుండీలు విప్పేశాడట. వాడి కేదోవిధంగా పాఠం చెప్పాలి.

అరగంటపైగా గడిచింది.

రాజారావు ఇంకా తేరుకోలేదు. తలుపు తట్టిన చప్పుడయితే వెళ్ళి తెరిచాడు.

ఎదురుగా సత్యం.

షర్టు రక్తపు మరకలతో నిండివుంది. చేతి గుడ్డతో ముక్కు తుడుచుకొంటూ లోపలకి వచ్చేడు సత్యం.

రాజారావు కంగారుగా అడిగాడు.

"రే సత్యం. వాట్ హాపెండ్. ఏమిటిది, ఏమయింది?"

సత్యం కంగారు పడకుండా చెప్పాడు.

"ఏం లేదు. ఊరికే కంగారుపడకు!"

రాజారావు కళ్ళల్లో నీరు తిరిగింది.

"నువ్వు చెప్పకపోయినా నేను గ్రహించగల్నా సత్యం. ఇది నా మూలంగా, నీకు సుబ్బారావు చేసిన పరాభవం, అవునా?" అన్నాడు రాజారావు.

రాజారావు సత్యం షర్టు మార్చుకొంటుంటే చూసేడు. మోచేతులు గీసుకొనిపోయాయి. వీపుపైన బెల్టుతో కొట్టిన చారలూ కనబడుతోన్నాయి.

"సత్యం ఇటు చూడు. నన్ను మీరందరూ కలిసి ప్రెసిడెంటుగా ఎన్నుకొన్నారు. అందే కాలేజీలో ప్రతి ఒక్కరి బాగోగులు చూడవలసిన కర్తవ్యం నాపైన వుంది. చెప్పు. ఇది చేసిందెవరో, వాడి అంతు చూస్తాను!

సత్యం తేలిగ్గా నవ్వేసి.

"నే పడే బాధ నీకు తెలీదురా రాజా, సుమిత్ర అమాయకురాలు. పాపం ఆ పిల్లకి నువ్వంటే ఇష్టం. ఆమాత్రం దానికిలా అల్లరిపెట్టడం వాళ్ళకు తగదు. ఆ మాటే వాళ్ళతోనూ అన్నాను. అక్కడ సుబ్బారావు పక్కన వేణుగాడు వున్నాడు. నేను చెప్పింది వాడికి నచ్చక ఏదో తొందరపడ్డాడంతే!"

రాజారావుకి రక్తం మరుగుతోన్నట్ట యింది.

గబగబ బయటకి నడిచేడు.

సత్యం పిలుస్తున్నా వినిపించుకో లేదు రాజారావు.

* * *

రాజారావుని అతని తల్లి తట్టిలేపింది.

"నీ కోసం ఎవరో అమ్మాయి వచ్చింది లే!" అని.

ఆ మాటతో రాజారావు మత్తు పూర్తిగా వదిలిపోయింది.

లేచి హాల్లోకి వచ్చాడు.

సుమిత్ర కుర్చీలో కూర్చునివుంది.

ఆ సమయంలో రాజారావుకి సుమిత్ర మొహం వంక చూడాలంటే అదోలా భయం అనిపించింది. మొహం చెల్లలేదు.

"ఏం? మొహం చాటుచేసుకొన్నావే. ఇక కాలేజీకి రావేమిటి?" అడిగింది సుమిత్ర.

"అది కాదు..." అని ఏదో చెప్ప బోయాడు రాజారావు. సుమిత్ర నవ్వింది. సుమిత్ర నవ్వితే రత్నాలు దోసిట్లో రాలతాయనిపిస్తుంది రాజా రావుకి.

"నువ్వు చాలా ధైర్యం గలవాడవను కొన్నాను రాజా, కానీ ఇంత పిరికి వాడివై పోతావనుకోలేదు. ఆడపిల్లని, నేనే ఏమీ జరగనట్టుగా కాలేజీకి వెళు తున్నాను, ఆఫ్టాల్ వెధవలెవరో ఏదో రాశారని, భయపడి కాలేజీ మానేస్తామా? ఇలా అయితే మనం ఎంతకాలం బ్రతగ్గలం."

రాజారావు సుమిత్ర మొహంలోకి చూసేడు.

జలతారు బొమ్మలా మెరుస్తోంది సుమిత్ర.

సుమిత్ర పోలీసాఫీసర్ రంగనాధ రావుగారి ఏకైక గారాబు పట్టి. సుమిత్రంటే పంచప్రాణాలు ఆయన గారికి. ఆ చిట్టితల్లి మనసుకి ఏమాత్రం కష్టం కలిగినా భరించలేరాయన.

ఆ పిల్ల 'కా' అంటే 'కా' 'కీ' అంటే 'కీ' గా పెంచుకొన్నారు. సుమిత్ర మనసుకి ఏమాత్రం కష్టం వాటిల్లిందని తెలిసినా కారణం వెదకందే నిద్రపోరు ఆయన. అది ఏరౌడీ వెధవో గనక అయితే వాడి వీపు పైన లాఠీలు విరిగిపోవల్సిందే. అయతే ఆయనగారికి అనుకోకుండా ట్రాన్స్ఫర్ అవడంతో సుమిత్ర గర్ల్స్ హాస్టల్లో చేరి చదువు కొంటోంది.

ఏ క్షణంలో మొదటిసారి పరిచయమయిందో గానీ, రాజారావుకీ, సుమిత్రకీ ఒకళ్ళంటే ఒకళ్ళకి పంచప్రాణాలన్నంతగా స్నేహితులైపోయారు.

"ఏమిటిది ? పిచ్చిపట్టినట్టు నావంకే చూస్తోన్నావ్ ?"

నవ్వింది.

రాజారావుకది నిజమే అనిపించింది. సుమిత్రకేసి తదేకంగా చూస్తే తప్పకుండా పిచ్చిపడుతుంది.

"పిచ్చిపట్టినా నిన్నొదిలి వెళ్ళిపోవాలన్న దిగులులేదు. ఈ వూళ్ళోనే పిచ్చాసుపత్రి వుందికనక" అన్నాడు.

సుమిత్ర కోపంగా చూసింది.

"ఛాల్లే వేళాకోళం" అని తిరిగి అన్నది.

"రాజా, నీ మనసెలాటిదో నాకు బాగా తెలుసు. కాలేజీల్లో సహజంగా ఇలాంటివి జరుగుతూనే వుంటాయి. లేనిపోని గొడవలు పెంచకు. బుద్ధిగా కాలేజీకి రా. లేకపోతే నాపైన ఒట్టు. అంతే ! అంది.

అంటూ అతని చేతిని తన చేతిలోకి తీసుకొంది సుమిత్ర.

అదే సమయంలో రాజారావు తల్లి శాంతమ్మ కాఫీ కప్పులతో అక్కడికి రావడంతో సుమిత్ర కంగారుగా తడబడి, పొందికగా కూర్చుంది.

"మా అమ్మగారు. ఈవిడ నా క్లాస్మేట్, పేరు సుమిత్ర." అని పరిచయం చేశాడు.

సుమిత్ర నమస్కారం చేసింది.

శాంతమ్మ నవ్వి అన్నది.

"అబ్బాయి, విషయమంతా చెప్పాడమ్మా. చాలా బాధపడుతున్నాడు. అయినా, ఈ ఎలక్షన్లూ అవీ మనకి వద్దురా అంటే విన్నాడు కాదు" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

రాజారావువైపు సుమిత్ర చిరుకోపంతో చూసింది.

"ఈమాత్రం దానికే పెద్ద ఇంట్లో చెప్పేయాలేమిటి ?" అంది.

''ఇలాంటి విషయాలు చెప్పకపోయినా ఎలాగో తెలుస్తాయి సుమిత్రా'' అన్నాడు.

"సరే, ఈవేళ ఎలాగూ కాలేజీలేదు కనక సినిమాకి పోదాం. సరేనా ?" అన్నది.

"ఓ...కే !" అన్నాడు రాజారావు.

* * *

రాజారావు క్యాంటీన్లోంచి బయట కొస్తుంటే సుబ్బారావు హేళనగా నవ్వేడు. అప్పుడు సుబ్బారావు పక్కనున్న వేణు అన్నాడు.

"సిగ్గులేని మొహం. ఏంచేస్తాం. నిన్నగాక మొన్న గోడ లెక్కింది చాలక, సినిమాకి బయల్దేరారు".

''సినిమా ఎలావుందో ?'' అన్నాడు మరొకాడు.

"వెచ్చగావుందిట. చలికాలం కదా! ఒకళ్ళతో ఒకళ్ళు కలిసిపోయేలా ఒదిగి మరీ కూర్చున్నారు. పాపం, ఇంకా సినిమా చూసేదెవ్రా?"

సుబ్బారావన్నాడు.

"దానికెలాగూ అలవాటే అనుకో. వీడికేం ఖర్మ పాపం. అది బెజవాడలో చదివేటప్పుడు క్రికెట్ కాప్టెన్ రంజన్ అనే వాడితో తిరిగేదట. ఇక్కడకొచ్చి వీడ్ని పట్టింది.

"అయినా, మనిషిని చూస్తే తెలీదేమిటీ? పెద్ద చెయ్యిలే." అన్నాడు వేణు పక్కనున్న మరో జులాయ్.

"ఇంతకీ ప్రెసిడెంటు నెంబరు రెండన్నమాట పాపం" వేణు అన్నాడు.

"ఏమో అది నాకు తెలీదు".

"వీడెన్నోవాడో తెలీదు కానీ, దానికి మొదటివాడు మాత్రం కాదు."

రాజారావు వెనక్కి తిరిగేడు.

నలుగురు గొల్లున నవ్వేరు.

రాజారావు సుబ్బారావు కాలరు పట్టుకొన్నాడు. అతని ధైర్యాన్నీ సాహసాన్నీ చూసి అవాక్కయి పోయారు సుబ్బారావు, అతని మిత్రులు కూడా.

"నోరెత్తకు చంపేస్తాను. ఈ రాజారావుని సామాన్యమైన వాడనుకోకు. పగబడితే ప్రాణం తీసేవరకూ వదలడు. కేవలం ఓర్పుతో సహిస్తున్నాను. ఇదే ఆఖరిసారి నేను చేసే హెచ్చరిక. ఈ సారి మీరు చూసేది నన్ను కాదు, నాలో వున్న పెద్దపులిని! అని వదిలి చరచర నడుస్తూ వెళ్ళిపోయాడు రాజారావు.

—సాయంత్రపు నీరెండకి సముద్రంలోని కెరటాలు వెండిలా తళతళమని మెరుస్తున్నాయి.

సుమిత్ర, రాజారావు క్వాలిటీ రెస్టారెంట్‌లో కూర్చుని కాఫీ తాగుతున్నారు.

సుమిత్ర ఖాళీకప్పు టేబిల్‌పైనపెట్టి అడిగింది.

''నిన్నో మాట అడుగుతాను, ఏమీ అనుకోవుగా?''

''చెప్పు" అన్నాడు.

"నీకిష్టముండదనుకో. అయినా..."

సుమిత్రతోపాటుగా లేచి బయట కొచ్చి, మెత్తటి ఇసుకలో ఓ చోట కూర్చున్నారిద్దరూనూ.

"చెప్పు, ఫర్లేదు" అన్నాడు.

"ఫ్రెండ్సందరూ నన్ను డాన్స్ ప్రోగ్రాం ఇమ్మంటున్నారు. నువ్వు సరేనంటే ఇవ్వాలనుకొంటున్నాను" అంది.

రాజారావు సుమిత్ర మనసులోని కోరికని చదివేడు. అందుకని మరేం అభ్యంతరం చెప్పకుండా

''తప్పకుండా ఇవ్వు" అన్నాడు.

''థేంక్స్" అంది సుమిత్ర.

ఇద్దరూ లేచినడవడం మొదలు పెట్టారు.

* * *

రాజారావు ఇంట్లో అడుగుపెడు

తూనే ఆశ్చర్యపోయాడు. వంటగది గుమ్మంలో కూర్చుని చిలిపిగా తన వంక చూస్తోంది శారద.

''ఇదేమిటీ? నువ్వెప్పుడొచ్చావ్!'' అని అడిగేడు శారద పెదవులు విరిచింది.

"ఛీ, ఇంటికొచ్చినవాళ్ళని ఎలా పలకరించాలో కూడా బొత్తిగా తెలీదు. పాపం బావ ఎలా పైకొస్తాడో ఏమో?"

రాజారావు తల్లి శాంతమ్మ మేన కోడలి గడుసు మాటలకి నవ్వి "వచ్చి ఓ గంట అయిందిరా. ఈ గంటలోనూ, వందసార్లైనా నిన్ను గుర్తు చేసుకొనుం టుంది" అన్నది.

"అవును నేను గుర్తుచేసుకొని, నోరు పడిపోయేలా వాగడవేఁ కానీ తన కసలు శారదనేది వుందని గుర్తుంటే కదా! పైగా కాలేజీ ప్రెసిడెంటు అయి పోయాట్టగా- ప్రెసిడెంటు,'' అని వత్తి పలికింది.

రాజారావు నవ్వుకొని లోపలకి వెళ్ళి పోయాడు. డ్రస్ మార్చుకొని తిరిగి అటు రాబోతూవుంటే, శారద అతని ముందు కాఫీ కప్పుతో ప్రత్యక్ష్యం అయింది.

''కాఫీ'' అంది.

రాజారావు అందుకొని రెండు గుట కల్లో తాగేశాడు. శారద చిలిపిగా నవ్వి గడుసుగా అడిగింది.

"కాఫీ అమృతంలావుంది కదూ బావా?"

"నీ మొహంలావుంది అనాలను కొన్నాడు రాజారావు.

"ఏంబావా, నీవు పెద్ద రౌడీవై పోయావుటగా, నిజవేఁనా?'' అడిగింది నవ్వుతూ.

"ఎవరు చెప్పారు?"

"అత్తయ్య నాకన్నీ చెప్పేసిందిలే."

"ఇంకేం చెప్పింది.?"

''నీ చెవులు మెలిపెట్టమంది. ఏం? మెలిపెట్టేదా? రాజారావు" నవ్వేడు.


"ఏమో అనుకొన్నాను. కానీ మాటలు నేర్చావ్. ఉత్తరౌడీ దానివై పోయావ్".

''ఖర్మ. ప్రతివాళ్ళూ అదే అంటారు. నాకాశ్చర్యంగా వుంటుంది. నేను కనీసం మా బావని కూడా కొట్టలేదుకదా, ఎలా రౌడీనైపోయానా అని'' అని నవ్వేసింది.

రాజారావు శారదలో చాలా మార్పుని గమనించేడు.

ఇదివరకటికంటే కాస్త లావెక్కింది. బొద్దుగా, ముచ్చటగా ఆకర్షణీ యంగా వుంది. శారద కదులుతుంటే జడ కుప్పెలు పిరుదులపైన పొందికగా అటు, ఇటు కదులుతూ తగులుతున్నాయి. అన్నింటికంటే, శారద మాట్లాడే మాటలు అతనికి చాలా బాగున్నాయి.

శారద అతని మేనమామ కూతురు. స్కూల్ఫైనల్ వరకూ సొంత వూళ్ళో చదువుకొని కాలేజీ చదువు వాళ్ళ వూళ్ళో అందుబాటులేని కారణంగా అన వసరమనుకొని మానేసింది.



మామయ్యకీ, అమ్మకీ కూడా శారదకీ, తనకీ పెళ్ళి జరిపించాలని కోరిక.

కానీ శారదని తనింతకాలం ఆ దృష్టితో చూడనేలేదు. తనకి సుమిత్రంటే ఇష్టం. పెళ్ళంటూ చేసుకొంటే సుమిత్రనే చేసుకోవాలనుకొంటున్నాడు.

రాజారావు స్నానంచేసి బట్టలు వేసుకొని బయటకు వెళ్ళబోతుంటే శారద అన్నది-

"వేటకా బావా ?"

"అంటే ?"

"కాలేజీ అమ్మాయిలకి లైట్‌కొట్టడానికా అని."

"లైట్‌కొట్టడానికి బయటదాకా వెళ్ళాలా ? ఇంట్లో నీవు లేవూ ?" అని గబగబ నడిచేడు.

అతని ఆఖరిమాటలు విని శారద నోరెళ్ళబెట్టింది.

* * *

రాజారావు భోజనం చేస్తుండగా శాంతమ్మ అన్నది.

"అదున్న నాల్గురోజులైనా ఇంటి పట్టునే వుండి దానికి కాస్త వూరు చూపించరా !" అని.

"నేను చూపిస్తే మాత్రం తను చూడ్డానికి సిద్ధంగా వుండద్దూ ? అసలే రౌడీ మేళం," అన్నాడు.

"వంకలేనమ్మ డొంక చుట్టూ తిరిగిం

దిట. చూడు మీ అబ్బాయి ఏమంటు న్నాడో. నేను రౌడీనట. అయినా బావకి నన్ను తిప్పితే ఏమొస్తుంది. చక్కగా ఏ గర్ల్ |ఫ్రెండో అయితే...పాపం...?"

అప్పుడు రాజారావుకి సుమిత్ర గుర్తొచ్చి నవ్వుకొన్నాడు. అది గమనించి,

"చూడు, ఎలా దొంగలా నవ్వు కొంటున్నాడో" అంది.

సాయంత్రం శారద అడిగింది.

"నిన్నోటడుగుతాను. నిజం చెప్తావా ?"

"అడుగు."

"అబద్ధం చెబితే నాపైన ఒట్టు."

"అలాగే."

"నీకో గర్ల్ ఫ్రెండ్ వుందటగా."

"ఎవరు చెప్పారు ?"

"ఎవరు చెబితే ఏం ? వుందా ? లేదా ?"

"వుంది."

"వెరీగుడ్. పేరు."

"సుమిత్ర."

"నాకు చాలా ఇన్‌సల్ట్‌గా వుంది" అంది.

"ఏం—?" అడిగేడు.

"ఇంత పెద్ద యూనివర్సిటీలో నా బావ అందగాడైనా ఒక్కతేనా గర్ల్ ఫ్రెండ్ అని."

రాజారావు నవ్వేడు.

"సరే-ఇంతకీ పిల్లని నాకెప్పుడు చూపిస్తావో ?" అడిగింది.

"చూడాలని అంత కోరికగా వుందా?"

"ఏం-నా బావకి ఓ అడస్నేహితు రాలుందంటే చూడాలనుకోడం తప్పా. నేను చూసి తీరాలి."

"చూస్తే ?" అడిగేడు.

"పిచ్చి బావా! సుమిత్ర అంద మైందో కాదో చూడాలి" అంది.

నిజానికి సుమిత్ర శారదకంటే అంద కత్తె కాదు.

ఆ విషయం రాజారావుకీ తెలుసు.

"నిన్నే అడిగింది" అన్నది శారద.

"అలాగే తీసుకెళతాను," అన్నాడు.

కాలేజీ కల్చరల్ వీక్‌లో సుమిత్ర డాన్స్ ప్రోగ్రాం వున్నరోజున శారదని తీసుకెళ్ళాడు రాజారావు.

అక్కడున్న అందం, సందడి, వాతావరణం శారదకి అమితంగా నచ్చి నాయి. తను కాలేజీలో చదువుకోలేక పోయినందుకు ఏడుపొచ్చింది.

కాలేజీ అంటే ఇంత అందంగా, గొడవగా వుంటుందని తెలీకపోయింది. స్కూల్ ఫైనల్ పాసవగానే వచ్చేసి అత్తయ్యదగ్గరుండి కాలేజీలో చేరా ల్సింది.

తనేదో కోల్పోయినట్టనిపించి బాధ కలిగింది.

వంటరిగా కూర్చుని దిగులుగా స్టేజీ వంక చూస్తుంది శారద. అంతలో రాజా

రావు వచ్చి శారద పక్కన కూర్చున్నాడు.

సుమిత్ర వేదిక పైకి వచ్చింది.

అరగంటపైగా నాట్యప్రదర్శన ఏ విధమైన అవాంతరం లేకుండా జయప్రదంగా ముగిసింది. అయితే దానిక్కావలసిన ముందు జాగ్రత్తలు రాజారావు తీసుకొన్నాడు.

గ్రీన్ రూంలోకి శారదని వెంట బెట్టుకు వెళ్ళాడు. రాజారావుని చూస్తూనే సుమిత్ర సంతోషంగా.

"ఎలావుంది ?'' అడిగింది.

"ఫైన్'' అన్నాడు. అటు తర్వాత-సుమిత్రకి శారదకి పరిచయం చేశాడు. సుమిత్ర నవ్వుతూ అన్నది

"ఇంత పెద్ద అత్తకూతురు వుందని నాకు ఎప్పుడూ చెప్పలేదేం ?"

సుమిత్రతో శారద శృతి కలిపి అంది.

"బావ చాలా తెలివైనవాడు లెండి ! ఇంత చక్కని స్నేహితురాలు వుందని నాకుమాత్రం చెప్పాడా ? లేదు. అవునండీ, మీరెలావుంటారో చూడాలని పట్టుబడితే తీసుకొచ్చాడు. మీరు చాలా బావున్నారు. చాలా చక్కగా డ్యాన్స్ చేశారు. రియల్లీ నాకు చాలా ఆనందంగా వుంది. నాక్కూడా డాన్స్ అంటే చాలా ఇష్టం. అసలు నేను డాన్స్ నేర్చుకోవాలనుకొన్నాను," అంది.

"ఆహా ! జనం చూడలేక చచ్చేవాళ్ళు" అన్నాడు రాజారావు

శారద చిరుకోపం నటించింది,

జనం పోతేపోయారు బావా ; నీ కోసమైనా నేర్చుకొని వుండాల్సింది.''

శారద మాటలకి సుమిత్ర నవ్వింది.

శారద సుమిత్రని ఇంటికి ఆహ్వానించింది.

"బావతో చెప్పినా ప్రయోజనం వుండదు. వుత్త బుద్ధవతారం. మీరు తప్పకుండా మా ఇంటికి రండి," అంది.

"అలాగే."

"నే నెక్కువరోజు లుండనిక్కడ. వున్న నాల్గురోజులైనా మీ స్నేహాన్ని నా మపంచాలి. తప్పదు," అంది శారద.

జెలసీ అనేది లేకుండా వాళ్ళిద్దరూ అలా కలిసిపోడం రాజారావుకి చాలా ఆనందం కలిగించింది.

సుమిత్రని హాస్టల్ దగ్గర దింపి శారదతో బయల్దేరాడు రాజారావు.

"ఇప్పుడు బస్సులుండవు. మనం ఎలా వెళ్దాం?" అడిగేడు.

"త్వరగా ఇల్లు చేర్చు బాబూ, చలిగా వుంది" అంది శారద.

"ఎలా వెళ్దామో నీవే చెప్పు" అన్నాడు.

"అటు చూడు. అక్కడ అన్ని రిక్షాలుండే ఎలా అంటావేమిటి ?" విసుక్కుంది.

"రిక్షా ఎక్కుదామా ?" అడిగేడు.

"ఏ, రిక్షాయేగా? ఎక్కేద్దాం," అని నవ్వింది.

రిక్షా మాట్లాడి ఎక్కారు.

రాజారావు ఇబ్బందిగా అన్నాడు.

"రిక్షా చాలా ఇరుగ్గా వుంది."

"రిక్షా ఇరుగ్గావుంటే ఫర్లేదు. మనసు ఇరుకై పోకుండా వుంటే అంతేచాలు."

శారద మాటలకి రాజారావు మాట్లాడ లేదు. శారద మోచేత్తో అతన్ని పొడిచి అన్నది.

"బావా, తంతే గారెల బుట్టలో పడ్డట్టు అందమైన పిల్లనే పట్టేశావే" అంది వేళాకోళంగా.

శారద అదేపనిగా సుమిత్ర గురించి మాట్లాడ్డం ఎంచేతనోగానీ రాజారావుకి నచ్చలేదు.

* * *

—రాజారావు స్నానాల గదిలోంచి తల్లిని కేకేశాడు.

"అమ్మా, అమ్మా!"

ఆ కేక విని శాంతమ్మ-

"వాడు ఎందుకో రంకెలు వెడు తున్నాడు. పోయి ఏం కావాలో చూడమ్మా" అంది శారదతో.

శారద గబగబ స్నానాల గదిదగ్గర కొచ్చి.

"ఏం బావా, ఏంకావాలి. సున్ను పిండా?" అంది.

"నీమొహం" అన్నాడు లోపల్నుంచి.

శారద గలగల నవ్వేసి-

"ఈ క్షణంలో నా మొహం కన బడితే ఇబ్బందిపడిపోతావ్ గానీ, సరిగ్గా కావల్సిందేదో చెప్పు" అంది.

అసలు నిన్నెవడు రమ్మన్నాడు, అమ్మని పిలిస్తే."

"అత్తయ్యే రాలేకనే నీతో సరస మాడ్డానికి నన్ను పంపింది. ఇంతకీ ఏం కావాలో అడుగు."

"...ఆ టవల్ తెచ్చి పడేయ్."

శారద టవల్ తెచ్చి చిలిపిగా అంది తలుపు కన్నం దగ్గర చేరి.

"బావా!" మెల్లగా పిలిచింది.

"ఊ...ఏమిటీ?"

"నిన్ను నేను చూస్తున్నాను" అంటూ గలగల నవ్వేసింది. రాజారావు కోపంగా అన్నాడు.

"అల్లరిచేస్తే నిన్ను లోపలకి లాగేస్తాను. ముందు టవల్ పడేసి పో" అన్నాడు.

"బాబోయ్" అంటూ టవల్ అక్కడ విసిరి పరుగుతీసింది శారద.


—రాజారావు అరుబయట ఈజీ ఛైర్లో కూర్చున్నాడు. శారద కాఫీ కప్పు పట్టుకొని అతని దగ్గర కొచ్చి నించుని అంది.

"కాఫీ తీసుకో."

"అక్కడ పెట్టి వెళ్ళు" అన్నాడు.

"ఏం బావా, నా మీద కోపం వచ్చింది కదూ?"

"అల్లరిచేస్తే కోపం కాక అభిమానం పుట్టుకొస్తుందా?"




శారద అతని పక్కగా మోకాళ్ళ పైన కూర్చుని, అతని గెడ్డం పట్టుకొని,

"ఏమిటో బాబూ, నువ్వొత్త మొద్దబ్బాయివి. అసలు నిన్ను చూస్తుంటేనే అల్లరి చెయ్యబుద్ధి అవుతుంది."

"ఛాల్లే, సంతోషం."

శారద ఈసారి నవ్వలేదు. అదోలా చూసింది అతనివేపు.

"నువ్వంటే నాకు ప్రాణం బావా. నిన్ను చూస్తుంటే, నా కేమిటో ఈ ప్రపంచానికే మహారాణీ నన్నంత గర్వంగా వుంటుంది. ఆశలు పెంచుకోడం స్వార్థం అవుతుందేమో గానీ తప్పుమాత్రం కాదనుకొంటాను."

రాజారావు ఆ మాటలకి చలించిపోయాడు.

"ఏమిటి శారదా నువ్వనేది?"

"మరేంలేదు, నన్ను నువ్వు తప్పుగా అర్థంచేసుకొంటున్నావేమో గానీ, నా మనసులో వున్న భయం ఎలాంటిదో నీకు తెలీదు."

"ఏమిటి శారదా, సరిగ్గా బోధపడేలా చెప్పు" అన్నాడు.

"నువ్వు కాలేజీ ఎలక్షన్లనీ అవనీ, ఇవనీ గొడవల్లో తిరగడం నా కిష్టం లేదు. అయినా మనకెందు కొచ్చిన గొడవలు బావా ఇవన్నీ."

శారద మాటలకి రాజారావు కాస్త ఊరటచెందాడు.

శారద ప్రస్తావిస్తుంది సుమిత్ర గురించేమో అనుకొన్నాడు. అసలు సుమిత్ర గురించి మాట్లాడకపోవడంతో తేలిగ్గా ఊపిరితీసుకొన్నాడు.

"పిచ్చి శారద! ఈ మాత్రం దానికేనా భయం"

"ఉత్త భయం కాదు బావా, ఆందోళన. మొన్న నీ ఫ్రెండ్ సత్యం వచ్చాడు. తోచక అతనితో చాలా సేపు మాట్లాడేను.

చాలా విన్నాను. రాజకీయాలు, పోట్లా టలు మనకికూడనివి వాటికీ, మనరక్తానికీ చాలా దూరం బావా; అదీకాక ఈ మధ్య పేపర్లో చదివేను, మీ యూని వర్సిటీలోనే రెడ్డి అనే కుర్రాడిని ఎలక్షన్ల కారణంగా పొడిచి చంపేశారని. అవన్నీ గుర్తుకొస్తే నాకేమిటో దిగులుగా వుంటుంది." శారద కళ్ళల్లో నీటి పొరలు కనుపించేయి.

"ఈ రాజారావు అంత తెలివి తక్కువవాడు కాదు శారదా!"

"పిచ్చి బావా! తెలివి ఎప్పుడూ మన సొంతం కాదు. ఇప్పటికి జరిగిందేదో జరిగిపోయింది. ఇక ముందైనా, ఇవన్నీ మానేసి, బుద్ధిగా చదివి, నువ్వు పరీక్ష పాసుకావాలి. నల్ల కోటు తొడగాలి. పెద్ద ప్లీడర్‌వి కావాలి. ఏంబావా, అలా పిచ్చిదాన్ని చూసినట్టు చూస్తు న్నావ్? నే చెప్పింది నీకు నచ్చలేదా!"

రాజారావు శారద చేతిని నొక్కి అన్నాడు-

"ఏమో అనుకొన్నాను. నీకు చాలా తెలుసు."

"నన్ను గురించి అప్పుడే ఏం తెలుసుకొన్నావ్. అదృష్టం వుండి నీ దాన్నయితే..."

శారద మాటలు పూర్తికాందేనే —

—"కాలేకపోతే," రాజారావు అను కోకుండా అన్న ఆ మాటలకి శారద కంగారుపడలేదు.

"వచ్చే జన్మకైనా నిన్ను చేరడానికి ప్రయత్నించేస్తాను. ఊ...ముందు కాఫీ తాగు. చల్లబడిపోతుంది," అని కప్పు అందించబోయి-

"సారీ, చల్లారిపోయింది. వెచ్చబెట్టి తీసుకొస్తాను." అని లేచి శారద లోపలికెళుతుంటే రాజారావు అటువైపే చూస్తూ వుండిపోయాడు.

* * *

సుమిత్ర సినిమా ప్రోగ్రాం వేసి, రాజారావుకి శారదని తీసుకొని థియేటర్ దగ్గరకి రమ్మని చెప్పింది.

రాజారావు శారదతో సహా, అర గంట ముందుగానే థియేటరు దగ్గర కొచ్చేడు.

అక్కడ వాల్ పోస్టర్లు చూసి శారద సిగ్గుపడింది.

"ఛీ... ఇలాంటి సినిమాకి తీసు కొచ్చావే!''


"సుమిత్ర దీనికే వెళదామంది. బ్లో హాట్—బ్లోకోల్డ్ అని. బావుంటుంది!" అన్నాడు.

"ఏంబాగో బాబూ, చూడు, ఒక్క ఆడది కూడా రాలేదు."

రాజారావు నవ్వి, "మనం చాలా ముందువచ్చేం. అసలు ఇలాంటి సినిమా లకివచ్చేదే ఆడపిల్లలు నువ్వేచూద్దుగానీ." అంతలో సుమిత్ర రానే వచ్చింది.

రాజారావు అన్నాడు.

"నువ్వు రావేమోనని బెంగపెట్టు కొంది మా శారద."



"ఎందుకనిటః" అంది నవ్వుతూ.

"ఎందుకేమిటండీ. బొత్తిగా బరి తెగించిపోవడంగానీ, అయినా, ఆడపిల్ల నిలాంటి సినిమాకి తీసుకొచ్చిన ఈ పాటుగాడ్ని అనాలి, ఖర్మ" అంది శారద.

సుమిత్ర నవ్వుతూనే వెళ్ళి టిక్కట్లు తీసుకొంది.

శారద లోపలికెళ్తూ అంది.

"బావా, నువ్వు నా పక్కన కూర్చో డానికి వీల్లేదు." "రాజా, నా పక్కన కూర్చోడాక్కూడా వీల్లేదు" అంది సుమిత్ర నవ్వుతూ.

అప్పుడు రాజారావు నవ్వి, "మొత్తానికి ఆడబుద్ధి పోనిచ్చేరుకాదు. బ్రతిమాలి సినిమాకి తీసుకొచ్చి ఇద్దరూ పొమ్మంటే ఏమవ్వాలి. థాంక్ గాడ్. టిక్కట్టయినా కొన్నావు" అన్నాడు.

"ఏమండీ సుమిత్రగారు, ఇప్పుడింతకీ మా బావ ఏంచెయ్యాలిట," అంది శారద.

"అతన్నే తేల్చుకోమందాం."

"అయితే టాస్ వెయ్యండి. ఎవరు ఓడిపోతే వాళ్ళపక్క నేను చేరతాను," అన్నాడు.

దానికి సుమిత్రా, శారదా కూడా ఏక గ్రీవంగా ఆమోదించారు. సుమిత్ర రూపాయి బిళ్ళతీసి పైకి ఎగరేసింది.

అది కాస్తా దొల్లుకొంటూపోయిపక్క నున్న డ్రైనేజిలో పడిపోయింది.

"అనవసరంగా రూపాయి పోగొట్టు కొన్నావు!" అన్నాడు రాజారావు.

"నా మూలంగానే కదూ?" అంది శారద.

"వెధవది రూపాయేగా — పోతే పోయిందిలే" అంది సుమిత్ర.

రాజారావు సుమిత్ర పక్కనే కూర్చున్నాడు. సుమిత్రకి మరోవేపు శారద కూర్చునుంది.

సినిమాజరుగుతున్నంత సేపూ శారదకి చచ్చేంత సిగ్గనిపించింది.

ముద్దులు; కౌగిలింతలు; పడి్రదొర్లటాలు 'అబ్బ హెల్' అనుకొంది.

సుమిత్ర లేకుండా వంటరిగా బావతో ఆ సినిమాకి వస్తే ఎలా వుండేదో కానీ ఇప్పుడు మాత్రం అదోలా సిగ్గుగానే వుంది.

సినిమాలో జరిగే ప్రతి చిన్నదానికి సుమిత్ర పగలబడి నవ్వుతూ, రాజారావుతో ఇంగ్లీషులో మాట్లాడుతోంది. అనుకోకుండా శారద తల తిప్పి చూసింది. సుమిత్ర చేతిలో రాజారావు చెయ్యి నలిగిపోతోంది.

శారద సిగ్గుపడి ఏదో చూడకూడనిది చూసినదానిలానూ, తెరపైకి చూపుని మరల్చుకొంది.

సుమిత్రేకాదు, ఆ సినిమా చూస్తున్న పూపులో తనైనా అంతేనేమో? ఆ క్షణంలో అది తప్పుగా మాత్రం తోచ లేదు శారదకి.

రాజారావు తనకి బావ. తనకి అదృష్టం కలిసొస్తే కాబోయే భర్త కూడానూ. అలాంటిది తన కళ్ళముందే పరాయి ఆడపిల్ల పక్కన తను సినిమా చూడ్డం గానీ ఆపిల్ల రాజారావు చేతిని నొక్కడం చూసి గానీ జెలసీమాత్రం చెందలేదు.

శారద చూడ్డం రాజారావు గమనించకపోలేదు. సుమిత్రని కళ్ళతోనే వారించాడు.

శారదవేపుతిరిగి సుమిత్ర "సినిమా ఎలావుంది?" అడిగింది.

శారద ఛలోక్తిగా, "ఏసినిమా గురించి మీరడిగేది?" అంది. ఆమాటలకి సుమిత్ర ఉలిక్కిపడింది.

"టూ ఇంటలిజెంట్" అంది నవ్వుతూ.

బయటినించి గాలి విసురు, వర్షం పడుతోన్న చప్పుడు వినబడుతోంది.

"వర్షం పడుతున్నట్టుంది" అంది సుమిత్ర.

సినిమా అయిపోయింది జనం వర్షంలోనే తడుస్తూ వెళుతున్నారు.

"ఇప్పుడెలా?" అన్నాడు రాజారావు కురుస్తోన్న వర్షాన్ని చూస్తూ.

"నేను ఏదోలా వెళ్ళగలను. మీరే చాలా దూరం వెళ్ళాలి," అంది సుమిత్ర మొహంపైకి పడుతోన్న కురులు వెనక్కి తోసుకొంటూనూ.

"నయం, భలేవారే. ఈ వర్షంలో వంటరిగా ఎలా వెళతారు. మా ఇంటి

కొచ్చేయండి. ఉదయం లేచి అట్నుంచే కాలేజీకి వెళ్ళిపోవచ్చు" అంది శారద.

సుమిత్ర శారదవంక అభిమానంగా చూసింది.

"ఇప్పటికే కాలేజీలో జనం కార్చే కన్నీటితో నిండిపోయిన సముద్రం పొంగేలా ఉంది. మీ ఇంటిదగ్గర ఓ రాత్రి వున్నట్టు తెలిస్తే, ఈసారి గోడల పైన పేర్లుకాదు, బొమ్మలు గీస్తారు!" అంది సుమిత్ర.

"నిన్ను వంటరిగా పంపడం నాకూ ఇష్టంలేదు!" అన్నాడు రాజారావు.

''పెద్ద దూరం కాదుకదా భయ పడ్డానికి! అయినా, నేనేం పిరికిదాన్ని కాదు. రిక్షా ఎక్కించు చాలు" అంది.

అక్కడే వున్న రిక్షాని పిలిచి మాట్లాడి సుమిత్రని ఎక్కించాడు.

ఇంకా కొంతమంది జనం వున్నారు.

శారద, రాజారావు నించున్నారు.

వర్షం జోరుతగ్గింది. కానీ గాలి వీస్తూంది విపరీతంగా.

"ఇప్పుడు మనం ఎలా?'' అడిగింది శారద.

వర్షం జల్లుకి ఇద్దరూ సాంతం తడిసి పోతున్నారు. ఇద్దరూ థియేటరు బయట వున్న చిన్న జాగాలో నిలబడ్డారు.

శారద మెల్లిగా, "బావా! ఛి, అసహ్యం, నీ వళ్ళంతా ఎలా కనబడు తోందో తెలుసా?"అంది.

రాజారావు మొహంపైకి పడ్డ జుత్తుని చేత్తో వెనక్కి తోసుకొంటూ అన్నాడు-

''నువ్వు గురివిందగింజని ఎప్పుడైనా చూశావా?" అడిగేడు.

"లేదు! ఎలావుంటుంది?" అడిగింది.

"తెలీదు కనక, చెప్పినా ప్రయోజనం లేదు ఎందుకో నిన్ను చూస్తుంటే అది గుర్తుకొచ్చింది. పోయి అద్దంలో చూసుకో. నీకే తెలుస్తుంది'' అన్నాడు.

అతని మాటలకి శారద అనుమానంగా తనవంక తాను చూసుకొంది. తన బట్టలు తడిసిపోయినాయి. తడిసి పోయిన చీరలోంచి, జాకెట్టులోంచి తన వళ్ళు పచ్చిగా నిరాధారంగా కనబడు తోంది.

చేతులు రెండూ గుండెలకి అడ్డంగా పెట్టుకొని సిగ్గుపడింది.

మరోవైపు రాజారావుపైన కోపమూ వచ్చింది.

'రౌడీమేళం! అన్నీ అల్లరి పనులే' అనుకొంది.

"ఏమిటది కొట్టేటట్టు చూస్తున్నావ్? అలాంటి మంచి ఉద్దేశ్యం ఏవన్నా వుంటే ముందే చెప్పు?" పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని నించున్నాడు.

"అవును మరి. దొరగారికి కొంప మునిగినట్టు ఈవేళే ముహూర్తం కుదిరింది సినిమాకి తీసుకురావడానికి. ఇక ఛస్తే ఎక్కడికీ నీతో రాకూడదు'' అంది.

అంతలో ఓ రిక్షా వచ్చింది.

అతను రిక్షా మాట్లాడుతుండే శారద అంది.

"సుమిత్రతో వేసినట్టు పిచ్చి వేషాలు వేస్తే చెవులు పిండేస్తాను. బుద్ధిగా కూర్చుంటానని మాట ఇస్తేగానీ, రిక్షా ఎక్కను."

"కోతిపిల్లల జోలికి రాజారావు రాడు గానీ, ముందు రిక్షా ఎక్కు'' అన్నాడు.

శారద చిరునవ్వు నవ్వి రిక్షా ఎక్కి కూర్చుంది. రిక్షాలో ఇద్దరికీ ఇరుకై పోయి; వాళ్ళకి తడవటంచేత వెచ్చగా వుంది. రాజారావుకి రిక్షా ఇంకా ఇరుకై పోయి, గాలికూడా పట్టనంతగా అయి పోతే బావుండుననిపించింది.

మనసుని తింటున్న కోరికను అణుచు కోలేక శారద రాజారావుని "వృత్త బుద్ధ వతారం బాబూ!" అనుకొంది.

—ఆ రాత్రి రాజారావుకి నిద్రపట్ట లేదు. సిగరెట్టు వెలిగించి కిటికీ దగ్గరగా వెళ్ళి నిలుచున్నాడు.

బయట గాలివిసురు ఇంకా అలాగే ఉంది. వర్షం కూడా కొద్దిగా పడుతోంది.

రాజారావు పక్కగదిలోకి తొంగి చూశాడు. శారద బెడ్ లైట్ వెలుగులో మంచంపైన పడుకొని కనబడింది. జుత్తు తడిసిపోవడంచేత, ఆరుతుందని కాబోలు వదిలేసింది. పవిట పక్కగా చెదిరి పోయింది. శారద బాగా బడలిక చెందిన దానిలా నిద్రపోతోంది.

రాజారావు సిగరెట్టు బయటికి విసిరి మెల్లిగా ఆ గదిలోకి నడిచాడు.

శారద మంచం దగ్గరగా వెళ్ళి నించుని తదేకంగా, శారద మొహంలోకి చూసేడు.

శారదలో వున్న ఆకర్షణ అతని మనసుని పిండేస్తోంది. రక్తం వేగంగా ప్రవహించడంచేత అతని గుండె, తత్తర పాటుగానూ, భయంగానూ అదురుతోంది అంచేత శరీరంలో వణుకుకూడా ప్రారంభమైంది.

వర్షంలో తడిసిన చీరలోంచి, జాకెట్టు లోంచి తను చూసిన శారద అందం ఇంకా కళ్ళకు కట్టినట్టుగా వుంది. నిద్ర పోతున్న శారదని అలా చూడ్డంతో అతనికి తృప్తి కలగలేదు. ఆనందంగా లేదు. శారదని తాకాలనీ, నలిపెయ్యా లనీ, శారద వంటిపైన బట్టలన్నీ తీసె య్యాలనీ వుంది.

మెల్లిగావంగి శారద పెదవులపైన ముద్దుపెట్టుకున్నాడు. శారద కళ్ళువిప్పి చూసింది.


రాజారావు కలవరపడి,

"సారీ! తప్పుచేశాను," అన్నాడు.

శారద లేచికూర్చుని అతని చేతిని తన చేతిలోకి తీసుకొని నిమురుతూ,

"తప్పుచేసే అధికారాన్ని నీకెప్పుడో ఇచ్చేసాను బావా!"

"శారదా!'' అన్నాడు అయో మయంగా.




"పిచ్చి బావా! నువ్వు చాలా మంచి వాడివి. అందుకే నువ్వంటే నాకు ప్రాణం" అంది అతని గుండెలపైన తల ఆనుస్తూనూ.

రాజారావు శారదని తనవేపుకు తిప్పుకొని, తనలో కలుపుకొన్నాడు.

* * *

మనిషిని హత్యచేసినంత పాపం తనకి చుట్టుకొన్నంతగా బాధపడ్డాడు రాజారావు.

శారద పైకి ఏమీ అనకపోయినా మనసులో తన బలహీనతని చూసి ఏమనుకొంటుంది?

ఓ పక్క శారద, మరోపక్క సుమిత్ర తనని వంచకుడని నిందిస్తున్నట్టుగా వుంది. తనతో జీవితాన్ని పంచుకొంటాడన్న నమ్మకంతో తనని అర్పించుకొంది శారద. తనని ప్రేమించి ఎవరేమనుకొన్నా భయపడక విచ్చలవిడిగా తనతో ఎక్కడికిపడితే అక్కడికి తిరుగుతోంది సుమిత్ర.

ఇప్పుడేం చెయ్యాలి?

ఇటు శారద?

ఆటు సుమిత్ర?

అడుగుల చప్పుడైతే తలెత్తి చూశాడు రాజారావు.

శారద నించునుంది.

"ఈవేళే ప్రయాణం బావా! నేను వెళ్ళిపోతున్నాను," అంది.

రాజారావు కేడుపొచ్చింది.

శారద తనని రెండు చెంపలూ పగిలేలా కొడితే బావుండుననిపించింది.

శారద రెండు భుజాలు పట్టుకొని తన వేపుకి తిప్పుకొన్నాడు.

"జరిగిందానికి చాలా బాధపడుతున్నాను. నన్ను క్షమిస్తావా శారదా" అన్నాడు. అప్పుడతని గొంతు జీరబోయింది.

శారద అతనికేసి ఆశ్చర్యంగా చూసింది.

"ఎందుకు?" అడిగింది.

రాజారావు కెలా చెప్పాలో తెలీలేదు. "నేనంటే నీకు అసహ్యంగాలేదూ?" అని అడిగేడు. శారద నిట్టూర్చింది.

"ఇంకాదానిగురించే ఆలోచిస్తున్నావా బావా! నేనింకా నీకు అర్థం కాలేదా? నీకిదివరకేచెప్పాను. నువ్వంటే నాకుప్రాణం. నీకోసం నేనేమయినా చేస్తాను. నీ తృప్తి కోసం, ఆనందంకోసం నా సర్వాన్ని ధారపోయడానికి నేను ఎప్పుడూ రెడీనే బావా! ఆఖరికి నీ చేతుల్లో నా జీవితం వాడిపోయినా దాన్నికూడా ఆనందంగానే స్వీకరిస్తాను. ఎక్కడున్నా ఎలావున్నా నువ్వు క్షేమంగానూ, సుఖంగానూ వుంటే నాకు అంతేచాలు."

"శారదా!" అన్నాడు రాజారావు అయోమయంగా.

"నన్ను మర్చిపోవుగా!" అడిగింది.

"పెద్దవాళ్ళతో స్నేహం చెయ్యవచ్చు. కానీ మంచివాళ్ళకి దగ్గరయితే అది ఎంత టార్చర్ కి దారితీస్తుందో ఇప్పుడే తెలిసింది శారదా! మల్లెపూల సౌరభంలా నా గుండెల్లోకి దూసుకొచ్చి నా మనసులోనూ, గుండెల్లోనూ నిండిపోయి ఇప్పుడిలా వెళ్ళిపోవడం...!"

శారద నవ్వింది.

రాజారావు బాధగా చూసేడు.

"నా మనస్సులో ఆలోచనలు సైక్లోన్ని మించి పోతున్నాయి శారదా! నేను మోసంచేశానేమో అన్న బాధ నన్ను పీడిస్తోంది."

శారద పెదవులపైన చిరునవ్వొకటి క్షణమాత్రం మెరిసి మాయమైంది.

"నువ్వు నన్ను మోసం చెయ్యడమా! భలేవాడివే. అది నీకు చేతనవుతుందా బావా!" అన్నది శారద.

రాజారావు గొంతు పెగల్లేదు.

"వెళ్ళిరానా?" అంది.

"నువ్వెళ్ళిచెయ్యవలసింది ఏముందని. కొన్నిరోజులుండి పోరాదూ?" అడిగేడు.

"నిన్నొదిలి వెళ్ళడం నాకు మాత్రం ఇష్టమా? అయినా నెలరోజులుండే లేని ప్రేమ ఇప్పుడు ఒలకబోస్తున్నావా?"


"నిజమే శారదా! నాలో ఏదో మార్పు వస్తోంది. అదేమిటో అర్థంకావడంలేదు. చిన్నప్పట్నుంచి నాకోసం ఎదురుచూసే ఓ ఆడపిల్ల వుందని తెలుసు. ఆ పిల్ల మనసు ఇంత మంచిదని తెలుసుకోలేకపోయాను."

"ఉపన్యాసం ఆపిక. వారంరోజుల్లో పరీక్షలున్నవాడివి. నన్నుగురించి ఆలోచనలు మాని బుద్ధిగా చదువు. శెలవలకి మావూరొచ్చేయ్" అంది.

"అలాగే" అన్నాడు.

"అంటే-ఇక్కడనించే సాగనంపుతున్నావా. రైలు ఎక్కించవేమిటి?" అని అడిగింది నవ్వుతూ.

రాజారావు శారదతోపాటు స్టేషన్ కెళ్ళాడు.



రైలు కదులుతుండగా శారద కళ్ళు నీటితో నిండినాయి. ఆ కన్నీళ్ళని దాచుకొనే ప్రయత్నంలో తల పక్కకు తిప్పుకొంది. ప్లాటుఫారంమీద నించుని విండో పక్కగా కూర్చున్న శారదని తదేకంగా చూస్తున్నాడు.

"ఇంకెతసేపుందిబావా రైలు?" అడిగింది.

"పదినిమిషాలు."

"పది నిమిషాల తర్వాత మనని ఈ రైలు విడదీస్తుందన్నమాట" అంది.

"ఛ...అవేం మాటలు."

"శెలవులకొస్తావుగా. రాకపోతే వూరుకొనేది లేదు."

"అలాగే."

"చూడుబావా. కుర్రాడు పువ్వులమ్ముతున్నాడు. ఓ పావలా పువ్వులు నీ చేత్తో తెచ్చివ్వు."

రాజారావు వెళ్ళి పువ్వులు తెచ్చి ఇచ్చాడు.

"థాంక్స్" అంది.

రైలు కదిలింది, రాజారావుకీ, శారదకీ మధ్య దూరం పెరిగిపోతున్న రీతిగా రైలు కనుచూపు మరుగైంది. కలతబారిన మనసుతో ఇల్లుచేరాడు, రాజారావు.

* * *

మర్నాడు పేపర్లో వార్తచూసి కంగారుపడ్డాడు రాజారావు. రైలు ప్రమాదంలో అరవైమంది మరణం, మరికొందరికి గాయాలు అని. శారద ఎక్కిన రైలు అదే. వార్త సరిగా

అందని కారణంగా శాంతమ్మ వంటరిగా వెళ్ళిపోయింది. పరీక్షలవడంచేత రాజారావు వెళ్ళలేకపోయాడు. అతని మన సంతా అక్కడే వుంది.

శారద కేవిధమైన అపాయం జరిగి వుండదని, జరగకుండా వుండాలని దేవుళ్ళకి మొక్కుకొన్నాడు.

పరీక్షలపైకి ధ్యాస పోవడంలేదు. పిచ్చిపట్టినట్టుగా వుంది. శారదకేమయినా జరిగివుంటే తను రాలేకపోయినందుకు ఏమనుకొంటుంది.

స్వార్థపరుడనుకొంటుంది. పరీక్ష సాకుతోనూ, తననిచూడ్డం ఇష్టంలేకరాలే దనుకొంటుంది. తను వెళ్ళివుండాల్సింది.

తల్లిదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అదురుతోన్న గుండెతో అది విప్పి చదివేడు. అందులోని వార్త చదివి అతను నిలువునా కృంగిపోయాడు.

రైలు ప్రమాదంలో తగిలిన దెబ్బకి శారదకి ఒక కాలు తీసేశారు. శారదకి ఇంత అన్యాయం జరిగిపోతుందని తను కలలోకూడా అనుకోలేదు. శారదకిలాంటి అన్యాయం చేసిన దేవుడు కన బడితే కొరడాపెట్టి కొట్టాలనిపించింది.

శారద జీవితం ఇప్పుడేమవుతుంది?

ఆడపిల్ల అవిటిదయితే జీవితం నరక మవుతుందని రాజారావుకి తెలుసు.

తెలిసే పెళ్ళికాకుండా తనకోరిక తీర్చ డానికి తన జీవితాన్ని తన సుఖంకోసం ధారపోసింది. ఏమీ తెలియకుండా విధికి తలొంచి కాలు పోగొట్టుకొంది శారద.

రాజారావుకి సుమిత్ర గుర్తుకొచ్చింది.

సుమిత్ర తనవల్ల నష్టపోయిందంటూ ఏమీలేదు. తనతో స్నేహం చెయ్యడం చేత గోడలపైన పేర్లెక్కాయి. సుమిత్ర పోలీసాఫీసరు కూతురు. ధైర్యం గలది. స్వతహా సోషల్ నేచర్. కాబట్టి ఎలాగైనా బ్రతగ్గలదు. సుమిత్రకి తను లేక పోయినా ఫర్లేదు.

కానీ శారద?

శారదతో తనకున్న సంబంధం అను బంధం సుమిత్రస్నేహం లాంటిది కాదు. ఇప్పుడు శారదని ఆదుకోవలసినబాధ్యత తనదేనని రాజారావు నిశ్చయించుకొన్నాడు. శారదకింత అన్యాయం జరిగి పోయేక తనపరీక్ష ఓ లెక్కలోది కాదు. మర్నాడే వెళ్ళి శారదకి ధైర్యం చెప్ప డానికి నిశ్చయించుకొన్నాడు.

ఆ సాయంత్రం సుమిత్రని బీచికి తీసుకెళ్ళాడు. పదినిమిషాలైనా అతనేమీ మాట్లాడకపోవడంతో సుమిత్ర అడిగింది.

"ఏమీ మాట్లాడవే?"

"నీతో చాలా మాట్లాడాలి. కానీ ఎలా మాట్లాడాలో తోచడంలేదు సుమిత్రా."

"భలేవాడివి. నాదగ్గరేనా ఈ మాటలు," అంటూ నవ్వింది. సముద్రపు గాలికి మొహంపైకి పడ్డ కురులు వెనక్కి తోసుకుంటూ.

"మా శారదకి రైలు ప్రమాదంలో కాలు విరిగింది. ఒక కాలు తీసేశారుట."

సుమిత్ర అదిరిపడింది.

"ఏమిటి మీరంటుంది?" అంది.

అంతకు మించి ఆ సమయంలో ఏం మాట్లాడాలో ఆ పిల్లకి తెలేదు.

రాజారావు విషాదంగా నవ్వేడు.

''శారద ఎంత పిచ్చిపిల్లో నీకు తెలీదు. చిన్నప్పట్నుంచి ఆ పిల్లని నా కిచ్చి చెయ్యాలనీ ఇంట్లో అనుకోడం. శారదకి నేనంటే ఇష్టమే. తన సొత్తు అనుకొనే నేను, నీతో స్నేహంచేసి తిరుగుతున్నా జెలసీ చెందలేదు."

''శారద మంచిది కాదని నేననలేదు కదా!'' అంది సుమిత్ర జాలిగా.

"శారద ఇక్కడున్న కొద్దిరోజు ల్లోనూ, తన మంచితనంతోనూ, ప్రవ ర్తనతోనూ ఆకట్టుకొంది. నాకోసం తన సర్వాన్నీ ధారపోయడానికీ, ఆఖరికి నా సుఖంకోసం తను నా చేతుల్లో వాడిపోయినా చిరునవ్వుతోనే దాన్ని భరించగల దేవత శారద.''

"నువ్వంటున్నది ?" అర్థంకాక అడిగింది సుమిత్ర.

"అవును సుమిత్రా. ఈ విషయం చెబితే నువ్వు నన్నసహ్యించుకొంటావని తెలుసు. కానీ ఇప్పుడు నేనున్న పరిస్థి తిలో చెప్పక తప్పదు. క్షణికమైన నా సుఖంకోసం, ఆనందంకోసం శారద శీలాన్ని బలి తీసుకొన్నాను.''

"రాజా,'' అంది ఆందోళనగానూ, భయంగానూ.

"నువ్వు నన్ను క్షమించినా, క్షమిం చకపోయినా ఇది నిజం."

"ఎంత పనిచేశావ్. నువ్వు ఇలాచేశా వంటే నమ్మలేకపోతున్నాను," అంది.

"అవును శారదకూడా అలాచేస్తానని అనుకొని వుండకపోవచ్చు. ఇప్పుడు తను అవిటిదైపోయింది. బ్రతుకు అంధ కారం అయిపోయింది. చెప్పు ఇప్పుడు నేనేం చెయ్యాలి."

"ఏంచెయ్యాలో కర్తవ్యాన్ని చెప్పు సుమిత్రా చెప్పు"

అతనిలోని ఆవేశాన్ని చూసి సుమిత్ర భయపడిపోయింది. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. చిత్తుగాతాగి, తెల్లవార్లు నిద్ర లేనివాడిలా అతని మొహం పీక్కు- పోయింది.

సుమిత్ర కళ్ళల్లో తిరుగుతోన్న కన్నీటి పొరల్నిచూసి రాజారావు కల వరపడ్డాడు.

"నేను వంచకుణ్నే అనుకో, స్వార్థ పరుడ్నే అనుకో. నా త్యాగాన్ని గుర్తిస్తే చాలు."

"ఏమిటీ!" అంది.

"శారద జీవితాన్ని చిగురింపజేయ డానికి మన ప్రేమని త్యాగం చేస్తు న్నాను సుమిత్ర. న్యాయంకోసం ఒక త్యాగమేకాదు జీవితాన్ని బలిచేసుకోడాని కైనా వెనుకాడను. ఒకళ్ళు హర్షించినా. హర్షించకపోయినా నువ్వొక్కదానివి నన్ను గుర్తిస్తే చాలు. చెప్పు సుమిత్రా నన్ను క్షమిస్తావా?" సుమిత్ర పేలవంగా నవ్వింది.

"వెరీగుడ్. ఐయాం ప్రౌడ్ ఆఫ్ యూ రాజా! కానీ నిన్ను చూస్తుంటే జెలసీగా వుంది."

"ఈ మాటలు నిజంగానే అంటున్నావా సుమిత్రా?"

"నన్ను నువ్వింతేనా అర్థంచేసుకొంది. రాజా! శారదంటె నీకేకాదు. నాకూ అభిమానురాలే. ఆమె జీవితాన్ని నువ్వు ఉద్ధరిస్తే నాకంతే చాలు. నేను పోలీసాఫీసర్ కూతుర్ని. అన్నీ వున్న ఇంట్లో పుట్టిన దాన్ని. నాకు దేనికీ లోటులేదు. అవిటి దాన్ని కాను. అందవిహీనురాల్ని కాను. చదువులేని దాన్నికాను. కనుక పెళ్ళి కాదనే భయం నాకు లేదు. ప్లీజ్ రాజా, నువ్విక్కడ్నుంచి వెళ్ళిపో. ప్లీజ్. నిన్ను చూస్తుంటే ఏడుపొస్తోంది. ఓ పక్క ఆనందంగావున్నా, మరోపక్క గుండెలు పగిలిపోతున్నాయి. నా జీవితానికిది చాలు. నీలాంటి స్నేహితుడు ఒకడున్నాడన్న సంతోషం, తృప్తీ నాకు మిగిలిపోతాయి. ప్లీజ్, వెళ్ళిపో. ఇంక నాకెప్పుడూ కనిపించకు నేనది భరించలేను" అంటూ బోరుమని ఏడిచింది.

రాజారావు సుమిత్రని ఓదార్చే ప్రయత్నం చెయ్యలేకపోయాడు.

* * *

శారద రాజారావుకేసి భయంగా చూసింది. శారద కళ్ళల్లో వూపిరి పెట్టుకొని వుంది. విరక్తి స్పష్టంగా కనబడుతోంది.

"ఎంతపనిచేశావ్ బావా! నాకోసం సుమిత్రని త్యాగం చేస్తావా? వద్దు బావా వద్దు. నేనది భరించలేను."

"ఇది త్యాగం కాదు శారదా. నీ జీవితాన్ని చక్కదిద్ది ఓ దారి చెయ్యవలసిన బాధ్యత నా పైనవేసుకొన్నాను."

"అందుకని ఈ అవిటి దాన్ని చేసుకొంటావా బావా!"

"నువ్వు అవిటివానివన్న విషయాన్ని నాకు పదే పదే గుర్తుచెయ్యకు. నేనది భరించలేను."

మోకాలువరకూ తీసివేసి, కట్టిన బాండేజీకేసి, చూసుకొంది. రాజారావు ఓసారి అటుచూసి తలతిప్పుకొన్నాడు.

శారద విషాదంగా చూసింది.

"చూసేవా? కొద్దిసేపుకూడా చూడలేకపోయావ్. అటువంటిది, జీవితాంతం ఈ కుంటిదాన్ని ఎలా భరిస్తావ్ బావా! పిచ్చి ఆలోచనలుమాని బుద్ధిగావెళ్ళిపో.''

"నువ్వు వెయ్యి చెప్పు. నేను నిన్నే పెళ్ళిచేసుకుంటాను. నా నిర్ణయానికి తిరుగులేదు.

"నా నిర్ణయం తీసుకోకుండానే నన్ను పెళ్ళిచేసుకోగలవా బావా! తెలిసే నీ జీవితాన్ని అంధకారం చేసుకోకు. చక్కగా పెద్ద చదువు చదివేవు. చక్కని భవిష్యత్తు నీముందుంది. ఈ చిరిగిన కాగితాన్ని నీ మెడకు చుట్టుకొని, జీవితాన్ని నరకం చేసుకోకు."

''అవిటిదానివి కాకపోతే నన్ను చేసుకోడానికి నీకేం అభ్యంతరం వుండేదికాదు కదూ! ఎప్పుడు ఏవిధమైన అవాంతరం వస్తుందో తెలీదు శారదా. నీకిలా అవుతుందని ఎవరైనా అనుకొన్నామా? ఇది

పెళ్ళయిన తర్వాతే జరిగితే ఏంచేసే దానివి. నన్నొదిలి వెళ్ళిపోయే దాని వనుకొంటాను." రాజారావు మాటలకి శారద కళ్ళల్లోకి నీరు పొంగింది.

"అనవసరంగా నా మనసు మార్చ డానికి ప్రయత్నం చెయ్యకు బావా! దిక్కుమాలినదాన్ని. బ్రతికి నీకో సమస్యగా తయారయ్యాను. అవిటి దాన్నయినా ఇలాగే బ్రతకాలనుకొన్నాను. కానీ నాకిప్పుడు చచ్చిపోవాలనుంది."

''తప్పు శారదా!'' అన్నాడు.

"ఇది తప్పుకాదు. నీ జీవితంలో ప్రవేశించి మూడుపువ్వులు ఆరుకాయ లుగా విలసిల్లబోయే నీ జీవితాన్ని కూల దోయడం నేరం అవుతుంది."

''మానసికంగా మనసులుకలవడంవేరు. కానీ మనం...మనమధ్య వున్న సంబం ధాన్ని కూడా కాదంటావా శారదా!"

శారద నవ్వింది.

"అన్నీ సవ్యంగా జరిగివుంటే మన మధ్య వున్న ఆ సంబంధం న్యాయ సమ్మతమైందే, కాదనను. దేవుడు నా జీవితాన్ని పెద్ద మలుపులోకి తిప్పేడు. ఆ మలుపులోనే నా జీవితం అంతం అయిపోవాలి."

"శారదా!"

"పిచ్చిబావా! వయసులోవున్న ఆడా మగా దగ్గరగా వున్నప్పుడు ఏ క్షణంలో నైనా అనుకోని ఏ మార్పు అయినా రావచ్చు. ఏ క్షణం ఎదురు కాకూడదో అదే ఎదురైంది. నువ్వు నాక్కాబోయే భర్తవన్న నమ్మకంతో నీకు నన్నర్పించు కొన్నాను. అదొక పీడకల. టేక్ ఇట్ యీజీ. నైట్ మేర్. పొరపాటే అయినా ఆ స్మృతినీ ఆ క్షణాలనీ, నా గుండెల్లో ముద్రవేసుకొన్నాను. నా చివరి క్షణాలు ఆసన్నమయ్యే వరకూ అవి అలాగే తియ్యగా దాచుకొంటాను."

"శారదా నీమనసు మార్చుకోలేవా?"

"తెలిసీ అశాంతిని కోరకు. రేపు పెద్ద లాయరువి అయితే ఎవరెవరో ఎక్కడెక్కడికో పిలుస్తుంటారు. అప్పుడు ఈ కుంటిపెళ్ళాన్ని వెంటపెట్టు కొని బయటికెలా వెళ్ళగలవు? కాకిలా కలకాలం బ్రతికేకంటే హంసలా ఒక్క రోజు చాలు!''

"నిన్ను పొందిన ఆ ఒక్కరోజుచాలు. ఇంకా నా జీవితంలో ముడిపెట్టుకోవాలనీ ఎందుకారాటం? మనం ఎప్పుడో కలుసు కొన్నాం" అంది.

"మళ్ళీ కలుసుకొనే అవకాశాన్ని శాశ్వతంగా యిమ్మని కోరుతున్నాను శారదా!"

శారద బాధగా నవ్వింది.

"నువ్వు త్యాగం చేసినా అది భరించి స్వార్థంతో నీ జీవితంలోకి రాలేను. వచ్చే జన్మలో తిరిగి నిన్ను పొంద డానికి ప్రయత్నం చేస్తాను. అయితే ఆ లోగానే ఇప్పట్లానేనేను నిన్నుకలిసేలోగా మరెవ్వరినీ ప్రేమించకు."

శారద ఆ మాటలు అంటూనే పక్కకి వాలిపోయింది.

రాజారావు కళ్ళనీరు తుడుచుకుంటూ రోడ్డుమీదకొచ్చి నించున్నాడు.

అతనికి ఎటుపోవాలో తెలీలేదు.